

గార : శ్రీకూర్మంలో కూర్మనాథుడు శ్వేత పుష్కరిణిలో విహరించారు. భక్తజనం తరించింది.



అరసవల్లి ఆలయ ప్రాంగణంలో శ్రీసుమిత్ర కళా సమితి నృత్యరూపకం



తెప్పోత్సవంలో భక్తజనం



తిరువీధిలో ఉత్సవమూర్తులు



నేత్రపర్వం...తేజోమయుడి తెప్పోత్సవం

- హంసనావలో ఊరేగుతూ దర్శనమిచ్చిన ఆదిత్యుడు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- స్వర్ణాలంకరణలో ఆదిత్యున్ని దర్శించుకున్న భక్తులు

అరసవల్లి: ప్రత్యక్షదైవం సూర్యనారాయణుడు ఉషాపద్మినిఛాయాదేవిలతో కలిసి విద్యుద్దీపాలంకృత హంసవాహనంపై జలవిహారం చేశారు. వేలాది మంది భక్తులకు కమనీయమైన దర్శన భాగ్యం కలిగించారు. బుధవారం క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా ప్రసిద్ధ సూర్యక్షేత్రం అరసవల్లిలో హంసనావికోత్సవం వైభవంగా నిర్వహించారు. పవిత్ర ఇంద్రపుష్కరిణిలో 12 సార్లు స్వామి వారు వాహనంపై విహరించారు. ఆలయ ఈవో వై.భద్రాజీ, సూపరింటెండెంట్ కనకరాజు, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. ఇదిలావుంటే బుధవారం ఉదయం నుంచే స్వర్ణాలంకరణలో ఉన్న ఆదిత్యుని మూలవిరాట్టును వేలాది మంది భక్తులు దర్శించుకుని తరించారు.

న్యూస్‌రీల్

నేడు 'సాక్షి' ఆధ్వర్యంలో బాలల దినోత్సవం



శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో బెహరా మనోవికాస కేంద్రంలో 'సాక్షి' ఆధ్వర్యంలో చిల్డ్రన్ లాఫింగ్ క్లబ్ సహకారంతో గురువారం బాలల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రత్యేకావసరాల గల చిన్నారుల మధ్య వేడుకలు జరగనున్నాయని పేర్కొన్నారు. చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.



హ్యాపీ చిల్డ్రన్స్ డే ఆకృతిలో వప్పంగి పాఠశాల విద్యార్థులు

అదనపు ఎస్పీగా కె.వి.రమణ



శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు శాఖకు అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.వి.రమణ రానున్నారు. ఈ మేరకు డీజీపీ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి.

మందస ఎస్‌ఐ సస్పెన్షన్

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలోని మందస పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ ఖాదర్‌బాషాపై శాఖపరమైన చర్యల్లో భాగంగా సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు బుధవారం రాత్రి డీఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చిన్నారులు కాదండోయ్ ▸ చిచ్చర పిడుగులు

సిక్కోలు చిన్నారులు అదరగొడుతున్నారు. నృత్యం, సంగీతం, క్రీడలు.. ఇలా పోటీలు ఏవైనా పతకాలు కొల్లగొడుతున్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు. గురువారం బాలల దినోత్సవం. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన కొందరు బాలలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

నాట్యమయూరి అనుశ్రీ..



అనుశ్రీ నృత్య ప్రదర్శన

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని అరకబద్ర గ్రామానికి చెందిన బింగి అనుశ్రీ పిట్ట కొంచెం.. కూత ఘనం అన్నట్లు నృత్య ప్రదర్శనలో అసమాన ప్రతిభ కనబర్చుతూ జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సాధిస్తోంది. ఇచ్ఛాపురంలో ఐదో తరగతి చదువుతున్న చిన్నారి అనుశ్రీ స్థానిక స్వేచ్ఛా నృత్య తరంగిణి నృత్యాలయంలో కూచిపూడి, భరత నాట్యం, జానపద నృత్యం విభాగాల్లో శిక్షణ తీసుకుంటోంది. 2023లో శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున ఆలయంలో ప్రదర్శించి అలరించింది. 2024 జనవరి 26న హైదరాబాద్‌లో నిర్వహించిన సాంస్కృతిక కళారాధనలో ఇచ్చిన ప్రదర్శనకు 'అభినయతార' అవార్డుతో నిర్వాహకులు సత్కరించారు. ఈ ఏడాది హైదరాబాద్ ఎన్టీఆర్ ఆడిటోరియంలో జరిగిన నృత్య పోటీల్లో పాల్గొని ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, నటులు జెమినీ సురేష్, డాక్టర్ కల్యాణ్ శాస్త్రి చేతుల మీదుగా ఉత్తమ అవార్డును కైవసం చేసుకుంది. ఆగస్టు 10న విశాఖపట్నంలో జరిగిన ఆల్ ఇండియా డాన్స్ ఫెస్టివల్ పోటీల్లో పాల్గొని 'నటరాజా' పురస్కారాన్ని పొందింది. తండ్రి బింగి నీలాద్రి రేషన్ షాపు డీలర్‌గా పనిచేస్తుండగా, తల్లి కుమారీ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్.

క్రీడా సుమాలు



ఖోఖో పోటీల్లో బంగారు పతకాలు సాధించిన భవానీ, మీనా

ఇచ్ఛాపురం రూరల్: వారందరూ పేద కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులే. తల్లిదండ్రులు వ్యవసాయ పనులు చేసుకుంటూ పిల్లల్ని కష్టపడి చదివిస్తున్నారు. వారు సైతం ఓవైపు చదువుకుంటూనే మరోవైపు క్రీడల్లోనూ సత్తా చాటుతున్నారు. ఇచ్ఛాపురం మండలం డొంకూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వై.భవానీ, 9వ తరగతి చదువుతున్న డి.మీనా ఖోఖో పోటీల్లో అదరగొడుతున్నారు. 2023లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో బంగారు పతకం సాధించి విజయ ప్రస్థానం ప్రారంభించి.. ఇటీవల ప్రకాశం జిల్లా లో జరిగిన అంతర జిల్లా ఖోఖో పోటీల వరకు చోటా విజయదుందుభి మోగించారు. మీనా, భవానీలు ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా ఖోఖో జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

భళా.. చిత్రకళ



షీల్డ్‌తో శ్రీకర్



తల్లితో నేహ



పతకం అందుకుంటున్న మాధురి

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని చిల్డ్రన్ లాఫింగ్ క్లబ్‌లో శిక్షణ పొందుతున్న శ్రీకర్, నేహ, మాధురిలు చిత్రలేఖనంలో సత్తాచాటుతున్నారు. ఇటీవల జాతీయ స్థాయిలో జరిగిన రంగోత్సవం పోటీలలో పాల్గొని ప్రతిభను కనబరిచారు.

- భోగి శ్రీకర్ దేవ్ బొమ్మలు వేయడంలో దిట్ట. ముంబైలో జరిగిన కార్టూన్ పోటీలలో జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి పతకం కైవసం చేసుకున్నాడు. ఎక్కడ చిత్రలేఖనం పోటీలు జరిగినా పతకాలు సాధిస్తున్నాడు.
- ఇదే క్లబ్‌కు చెందిన నేహ అభిత చేతిరాత పోటీలో ప్రావీణ్యం చూపుతోంది. కూచిపూడిలో అద్భుత ప్రదర్శనలు ఇస్తోంది. యూకేజీ చదువుతున్నప్పుడే తానా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించింది.
- క్లబ్‌కు చెందిన మాధురి కలరింగ్, గ్రీటింగ్ కార్డు తయారీపై ఇటీవల జరిగిన రంగోత్సవ్ పోటీలో సిల్వర్‌మెడల్, మాస్క్ తయారీలో బ్రాంజ్ మెడల్ సాధించింది.

11 ఏళ్లు.. మూడు వరల్డ్ రికార్డులు



యోగాసనాలు వేస్తున్న ఆశిష్

టెక్కలి: మండలంలోని బలరాంపురం గ్రామానికి చెందిన సంపతి రావు ఆశిష్, పలాసలో సత్యసాయి విద్యా విహార్ లో 8వ తరగతి చదువుతున్న ఆశిష్ చిరుప్రాయంలోనే ఆసనాలపై ఆసక్తి పెంచుకుని మూడు వరల్డ్ రికార్డుల్లో పేరు నమోదు చేసుకున్నాడు. మంచిర్యాలలో నిర్వహించిన 24 గంటల కళాకారుల ప్రదర్శనలో 57 సెకండ్లలో 27 ఆసనాలు వేసి ప్రముఖుల చేతుల మీదుగా సత్కారం పొందాడు. 108 రౌండ్స్‌లో సూర్య నమస్కారాలు వేసి యోగాసన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సొంతం చేసుకున్నాడు. తండ్రి మోహన్‌బాబు ఫొటోగ్రాఫర్ కాగా.. తల్లి అమ్మోజి మహిళా పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాలను ఎగ్జామినేషన్ అండర్ గ్రాడ్యుయేషన్ ఇన్‌చార్జి డీన్ డాక్టర్ జి.పద్మారావు బుధవారం విడుదల చేశారు. 7785 మంది పరీక్ష రాయగా 2925 మంది ఉత్తీర్ణులయ్యారు. 37.57 శాతం ఉత్తీర్ణత నమోదైంది. వర్సిటీ వెబ్‌సైట్, జ్ఞానభూమి పోర్టల్లో వివరాలు అందుబాటులో ఉంచారు. రీవాల్యుయేషన్‌కు 15 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని డీన్ సూచించారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 20 వరకు జరగనున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజుతో కలిసి పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పి.వి.భాస్కరరాజా పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత జిల్లా లక్ష్యం

శ్రీకాకుళం క్రైమ్ : పెను సవాల్‌గా మారిన మత్తుపదార్థాల వినియోగాన్ని తిప్పికొట్టాలని, మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సిబ్బందికి పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల నిర్వాహకులు, ప్రతినిధులతో కలిసి సమీక్ష నిర్వహించారు. చిన్నపిల్లలు, మహిళలపై వేధింపులు ఎక్కువయ్యాయని, వీటిని అరికట్టాలన్నారు. విద్యా సంస్థల్లో ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌ను నియంత్రించాలన్నారు. సైబర్ నేరాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు, సీఐలు, ప్రభుత్వ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

17 నుంచి ధాన్యం కొనుగోళ్లు

నరసన్నపేట: జిల్లాలో ఈ నెల 17 నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి తెలిపారు. నరసన్నపేటలోని వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయంలో వీఏఏ, వీహెచ్‌ఏలకు రబీ సీజన్‌పై ఒక రోజు శిక్షణ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం తేమ 18 శాతానికి మించకూడదన్నారు. ఈ విషయమై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ శాఖ డీడీ భవానీశంకర్ మాట్లడుతూ కొంత మంది వీఏఏలు బాధ్యతగా పనిచేయడం లేదని, తీరు మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త చిట్టిబాబు, ఏడీఏలు కృష్ణారావు, రవీంద్రభారతి, వ్యవసాయాధికారులు చిరంజీవి, కె.సునీత, కె.సురేష్ పాల్గొన్నారు.

ఇదేమి రాజ్యం

- ప్రభుత్వంపై నిరసన గళం

మాపై ఎందుకీ కక్ష?

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కూటమి ప్రభుత్వం కక్షగట్టి ముగ్గురు మున్సిపల్ శానిటరీ మేస్త్రీలను తొలగించడం అన్యాయమని, తక్షణమే వారిని విధుల్లోకి తీసుకోవాలని మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కల్యాణి అప్పలరాజు, అధ్యక్షుడు కె.వేణుగోపాల్‌లు డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం సంఘం ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగర పాలక సంస్థ కార్యాలయం దగ్గర బుధవారం మెరుపు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న పెదలాపు మోహన్ కృష్ణ, అల్లు ఉపేంద్ర, పెసల రాములను ఎటువంటి నోటీసులు జారీ చేయకుండా అకారణంగా తొలగించడం అన్యాయమని మండిపడ్డారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తగదు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పౌర హక్కుల నేతలు

కాశీబుగ్గ: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పౌరహక్కుల సంఘం కరపత్రాలను విడుదల చేసింది. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పాత జాతీయ రహదారిలో ఉన్నటువంటి పెంటదాలయ్య ఆశ్రమంలో బుధవారం కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం మొండివైఖరి వీడి ప్రైవేటీకరణ అపాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ అధ్యక్షుడు పత్రి దానేష్, కార్యదర్శి పిండి వెంకటరావు, ఉపాధ్యక్షుడు రామారావు, సోమనాథం, దున్న కృష్ణ, లక్ష్మణ్, పూర్ణచంద్రరావు, జోగారావు, వైకుంఠరావు, ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలు చేయాలి



బొడ్డపాడు సచివాలయం వద్ద ధర్నా

పలాస: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగమైన సూపర్ సిక్స్‌ను తక్షణమే అమలు చేయాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. బొడ్డపాడు సచివాలయం వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. అనంతరం వీఆర్వో సంతోష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా, హామీలను అమలు చేయడంలో తాత్సారం చేస్తోందని మండిపడ్డారు.

సామాన్యుడిపై భారం



పోస్టర్లు ప్రదర్శిస్తున్న సీపీఎం నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్/ఎచ్చెర్ల: సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీలను పెంచడం వల్ల సామాన్యుడిపై పెనుభారం పడుతుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.వి.రమణ మండిపడ్డారు. ప్రజా సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా అరిణాం అక్కివలస కూడలి వద్ద బుధవారం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయానికి వినియోగిస్తున్న స్మార్ట్ మీటర్లు తొలగించాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ అమలు చేయాలన్నారు.